RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 35 పేజీలు - 04 వెల - 04/- గురువారం 7 నవంబర్ 2024



# వైట్ హౌస్ కింగ్ డొనాల్డ్ ట్రంప్

ఇప్పటికే 277 ఎలక్టోరల్ ఓట్లతో విజయ దుందుభి

226 ఓట్లకే పరిమితమైన హ్యారీస్

26 రాష్ట్రాలలో ట్రంప్ కే పట్టం

రెండో సారి అధ్యక్ష పీఠంపై ట్రంప్

ట్రంప్ గెలుపుతో భారత్ బంధం మరింత బలోపేతం

అభినందనలు తెలిపిన మోడీ



2లో

# భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం...

- ఏపీ డ్రోన్ పాలసీకి కేబినెట్ ఆమోదం...
- రూ.1000 కోట్ల పెట్టుబడులు, రూ.3 వేల కోట్ల రాబడే లక్ష్యం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం
- మీడియాకు వివరాలు తెలిపిన మంత్రి పార్థసారథి
- వరల్డ్ డ్రోన్ డెస్టినేషన్ గా ఏపీ... డ్రోన్ హబ్ గా ఓర్వకల్లు

రూ.3 వేల కోట్ల రాబడే లక్ష్యంగా చర్యలు



అమరావతి,నవంబర్6 ఆంధ్ర ప్రగతి:
ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఏపీ జీఎస్టీ 2024 చట్ట సవరణ, 2014 - 18 మధ్య నీరు, చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆమోదం తెలిపింది. మంత్రివర్గంతీసుకున్ననిర్ణయాలను మంత్రికొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ - 1982 చట్టం ఉపసంహరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భూకబ్జాదారులపై కేసులు పెట్టడానికి నిబంధనలు అడ్డంకిగా ఉండడంతో రెవెన్యూ శాఖ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో త్వరలో జరిగే శాసనసభలో పాత చట్టం రద్దు, కొత్త చట్టం రూపకల్పన చేయనున్నారు. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ఏపీ డ్రోన్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.



మిగతాది 2లో...

# అమిత్ షాతో పవన్ కల్యాణ్ భేటీ

మర్యాదపూర్వకంగానే కలిశామని వెల్లడి



న్యూఢిల్లీ,నవంబర్6 ఆంధ్ర ప్రగతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హస్తిన చేరుకున్నారు. తొలిసారి ఏపీ ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి అమిత్ షాతో సమావేశమయ్యారు. దాదాపు 15 నిమిషాల పాటు అమిత్ షాతో పవన్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల అంశం ఇరువురి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. అంతకుముందు పవన్ మీడియాతో మాట్లాడుతూ అమిత్ షాతో మర్యాదపూర్వకంగానే సమావేశమవు తున్నామని తెలిపారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకూ ఢిల్లీ పెద్దలను కలవలేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మర్యాదపూర్వకంగానే సమావేశమవుతున్నామని పవన్ వెల్లడించారు. ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి మరింత బాధ్యతగా ఉంటామన్నారు. అప్పుడైనా ఇప్పుడైనా బాధ్యతతోనే పర్యటనలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కొలువుదీరిన టిటిడి నూతన పాలకమండలి

సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం

తిరుమల పవిత్రత కాపాడడం ముందున్న లక్ష్యం

పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడి

తిరుమల,నవంబర్6 ఆంధ్ర ప్రగతి: తిరుమల తిరుపతి నూతన పాలకమండలి బుధవారం కొలువు దీరింది. టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు కొందరు సభ్యులు పదవీప్రమాణం చేశారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ నాయుడు మాట్లాడుతూ.. తమకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మిగతాది 2లో...



# 'పీఎం-విద్యాలక్ష్మి'కి కేంద్ర కేబినెట్ అమోదం

న్యూ ఢిల్లీ,నవంబర్6 ఆంధ్ర ప్రగతి:
విద్యార్థులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. పీఎం-విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన నేడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎం-విద్యాలక్ష్మీ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 860 విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్రం హామీతో రూ.7.50 లక్షల వరకు రుణం లభించనుంది. రుణంలో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది.క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడిస్తూ.. ఎఫ్‌సీఐలో మూలధన అవసరాలకు రూ.10,700 కోట్లను కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఇక పీఎం విద్యాలక్ష్మి పథకం ద్వారా ఏటా 22లక్షల మందికి పైగా ప్రతిభావంతులైన విద్యార్థులకు లబ్ది చేకూరనుంది. ఇది సరళమైన, పారదర్శకమైన స్టూడెంట్ ఫ్రెండ్లీ ప్రక్రియ అని మంత్రి తెలిపారు. రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. రూ.10లక్షల వరకు రుణాలపై రూ.3శాతం వడ్డీరాయతీ కల్పించనున్నారు.



# కడప ఎస్పీపై బదిలీ వేటు

పవన్, లోకేశ్, అనితలపై వర్రా రవీంద్రారెడ్డి అసభ్యకర పోస్టులు

రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంపై ప్రభుత్వం ఆగ్రహం

కడప జిల్లాలో సీఐ సస్పెన్షన్

వైసీపీ కార్యకర్త రవీంద్రారెడ్డిని అదుపులోకి తీసుకుని వదిలేసిన పోలీసులు...

అమరావతి,నవంబర్6 ఆంధ్ర ప్రగతి:
కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజును ఏపీ ప్రభుత్వం బదిలీ చేసింది. హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌కు కడప ఎస్పీగా అదనపు బాధ్యతలు





అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపా నేత వర్రా రవీంద్రరెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం హర్షవర్ధన్‌పై చర్యలకు ఉపక్రమించింది. రవీంద్రరెడ్డి చేసిన అసభ్యకర పోస్టులపై ఫిర్యాదులు వచ్చినా, చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. మరోవైపు కడప జిల్లాలో మరో సీఐని కూడా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మిగతాది 3లో...

# ఆంగ్లో -ఇండియన్స్ సమస్యల పరిష్కారానికి కృషి.!

2లో

- రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

-మంత్రి ఫరూక్ ను కలిసిన ఏడు రాష్ట్రాల ప్రతినిధుల బృందం.



# ఐదు నెలల్లోనే ప్రజలకు చుక్కలు

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా మూడు రోజులు నిరసనలు :వైఎస్ షర్మిల

2లో

# వైట్ హౌస్ కింగ్ ట్రంప్

నవంబర్6 ఆంధ్ర ప్రగతి:
అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి అగ్రరాజ్య పీఠాన్ని అధిరోహించబోతున్నారు. ఇప్పటి వరకు విడుదలైన ఫలితాల్లో ట్రంప్ 277 ఎలక్టోరల్ ఓట్లతో విజయ దుందుభి మోగించారు. అధ్యక్ష పీఠం దక్కించుకోవాలంటే 270 ఎలక్టోరల్ ఓట్లు అవసరం.. ఆ మార్క్ ను దాటేసిన ట్రంప్ 300 మార్క్ దిశగా సాగుతున్నారు. కమలా హారిస్ కు 226 ఎలక్టోరల్ ఓట్లు పోల్ అయ్యాయి. ఎన్నికల ఫలితాలు మొదలైనప్పటి నుంచి కూడా ట్రంప్ ముందంజలోనే ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఎంతో ముఖ్యమైన స్వింగ్ స్టేట్స్ ఫలితాల్లో కాస్తా అటు ఇటు అయినప్పటికీ కూడా ట్రంప్ నే విజయం వరించింది. ముందు నుంచి కూడా ఎన్నికల్లో గెలుపు మీద ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. అనుకున్నట్లుగానే ఆయనే గెలిచారు. మొత్తం 50రాష్ట్రాల్లో ఎన్నికలు జరగగా ఆ వెంటనే కౌంటింగ్ ప్రారంభించారు.. ఇప్పటికే 44 రాష్ట్రాల ఫలితాలు విడుదలయ్యాయి.. మరో ఆరు రాష్ట్రాల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది.. వాటిలో ఆయిదు రాష్ట్రాల్లో ట్రంప్ అధీక్యంలో ఉండగా, ఒక్క రాష్ట్రంలో మాత్రం కమలా హ్యారీస్ ముందజంలో ఉన్నారు. మొత్తంగా ట్రంప్ ఇప్పటి వరకు 26 రాష్ట్రాల్లో విజయం సాధించగా, కమలా హ్యారీస్ 18 రాష్ట్రాలకే పరిమితమయ్యారు.

### రెండోసారి అధ్యక్ష పీఠం

277 ఎలక్టోరల్ ఓట్లతో మేజిక్ ఫిగర్ క్రాస్ చేసిన ట్రంప్, 67,204,711 పాపులర్ ఓట్లు సాధించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. గతంలో అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠం ఎక్కబోతున్నారు.మేజిక్ ఫిగర్కు 44 ఎలక్టోరల్ ఓట్ల దూరంలో హ్యారిస్ ఆగిపోయారు. చివర్లో గట్టి పోటీ ఇచ్చినా స్వింగ్ స్టేట్స్ లో ట్రంప్ ఆధిపత్యం కొనసాగడంతో కమలా ఓటమి పాలవ్వక తప్పలేదు. %మొదటి నుంచి చివరి వరకూ ట్రంప్ దూకుడు కొనసాగింది. ఒక సమయంలో స్లో అయిన ట్రంప్ 230 ఓట్ల దగ్గర చాలాసేపు నిలిచిపోయారు. ఆ సమయంలో కమలా హ్యారిస్ వేగంగా అందుకుని గట్టి పోటీ ఇచ్చారు. 226 ఓట్ల దగ్గర కమలా ఆగిపోయారు. కమల హ్యారిస్కు 62,303,005 పాపులర్ ఓట్లు రాగా చివర్లో ట్రంప్ మెరుపు వేగంతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

### టంప్ గెలుపుతో భారత్ బంధం మరింత బలోపేతం

#### అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్నకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ట్రంప్ చరిత్రాత్మక విజయం సాధించారని ఎక్స్ లో ట్విట్ చేశారు. తమ మైత్రి వల్ల భారత్-అమెరికా బంధం బలోపేతం అవుతుందని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు దేశాల ప్రజల జీవితాలు మెరుగుపరుద్దమని, ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయ దుందుభి మోగిస్తున్నారు. ట్రంప్ మ్యాజిక్ ఫిగర్ 270 దాటేశాడు.. స్వింగ్ స్టేట్స్లో ట్రంప్ సత్తా చాటారు. ఈ ఫలితాలపై ట్రంప్ కూడా స్పందించాడు. తన జీవితంలో ఇలాంటి క్షణం ఎప్పుడూ చూడలేదని, అమెరికా ప్రజల కష్టాలు తీరబోతున్నాయని చెప్పారు. అమెరికా ప్రజలు ఇలాంటి విజయాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. అమెరికాకు పూర్వవైభవం తెస్తానని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేస్తానని, తన గెలుపుతో అమెరికాకు మేలు జరుగుతుందన్నారు. స్వింగ్ రాష్ట్రాల్లో తాను ఊహించిన దానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని చెపుకొచ్చారు. తనకు 315కు పైగా ఎలక్టోరల్ ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తన విజయానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సెనెట్తో పాటు కాంగ్రెస్లో కూడా తమకే ఆధిక్యమని ఉందన్నారు. కొత్త చట్టాలను తీసుకురావడానికి తమకు ఇబ్బందులు లేవని, అమెరికాకు స్వర్ణయుగాన్ని తీసుకొస్తామని చెప్పారు. అసాధ్యాన్ని అమెరికా ప్రజలు సుసాధ్యం చేశారన్నారు. ఎవరైనా చట్టబద్ధంగానే దేశంలోకి రావాలని, సరిహద్దులను నిర్ణయిస్తామన్నారు. మస్క్ సహా తన విజయం కోసం పనిచేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. తన విజయంలో ఎలాన్ మస్క్దే కీలకపాత్ర ఉందని, అమెరికా రాజకీయాల్లో కొత్త స్టార్ ఎలాన్ మస్క్ అని కొనియాడారు. ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ తనకు సరైన ఛాయిస్ అని చెప్పుకొచ్చారు.

### ట్రంప్ కు అభినందనలు తెలిపిన చంద్రబాబు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గ్రాండ్ విక్టరీ సాధించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. "అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన ట్రంప్ కు అభినందనలు. అమెరికాను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన విజయవంతం కావాలని కోరుకుంటున్నా. యూఎస్ ప్రెసిడెంట్ గా ట్రంప్ మొదటి పదవీకాలంలో అమెరికా-ఇండియా సంబంధాలు బలోపేతమయ్యాయి. ప్రధాని మోదీ, ప్రెసిడెంట్ ట్రంప్ ల నాయకత్వంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు, పరస్పర సహకారం మరింత బలోపేతం అవుతాయని విశ్వసిస్తున్నా" అని తెలిపారు.

# ఆంగ్లో -ఇండియన్స్ సమస్యల పరిష్కారానికి కృషి.!

## - రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.
## -మంత్రి ఫరూక్ ను కలిసిన ఏడు రాష్ట్రాల ప్రతినిధుల బృందం.

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 06:
రాష్ట్రంలో ఉన్న ఆంగ్లో ఇండియన్స్ కుటుంబాల సంక్షేమానికి, వారు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ పేషి లో ఆంగ్లో-ఇండియన్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృందం (ఏపీ %ఒ% తెలంగాణతో సహా 7 రాష్ట్రాలతో కూడినది) మంత్రి ఫరూక్ ను కలిశారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డా.ఎ.రాయ్ రోజారియో, ప్రధాన కార్యదర్శిఎన్.పాట్రిక్ డూలాండ్,సభ్యులు బార్బరా ఆన్ బెర్ఫీ,అమలా వాలెస్,నిక్సన్ డి'క్రూజ్, కొరెట్టా అలియాస్ కవిత,కోరిన్ న్యూబెగింగ్ లు మంత్రి ఫరూక్,మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కే హర్షవర్ధన్,ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి డాక్టర్ ఏ.శేఖర్ ల దృష్టికి ఆంగ్లో ఇండియన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో దాదాపు లక్ష



దాకా ఆంగ్లో ఇండియన్స్ జనాభా ఉందని, అయితే ఎటువంటి అభివృద్ధికి సంక్షేమానికి నోచుకోలేక పడుతున్న ఇబ్బందులను ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆంగ్లో ఇండియన్స్ కు చట్టసభల్లో ప్రాతినిధ్యానికి కేటాయింపులు, ఉన్నత విద్య అభ్యాసనం, ఉపాధి కోసం రిజర్వేషన్ అమలు,బ్యాంకుల నుంచి రుణాలు అందేలా సరళీకృతమైన విధానాలు తో పాటు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూగత ప్రభుత్వ హయాంలో ఆంగ్లో ఇండియన్స్ కు దక్కాల్సిన సంక్షేమ ఫలాలు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో భాగంగా వివిధ సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే చర్యలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం జరిగిందని అన్నారు. ఆంగ్లో ఇండియన్స్ కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు, వారి అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలను సీఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం ద్వారా చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఫెడరేషన్ ప్రతినిధుల బృందానికి మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు. అనంతరం సిక్కుల సంఘం ప్రతినిధులు కూడా మంత్రి ఫరూక్ ను కలిశారు. ఏపీలో సిక్కుల ఆర్థిక స్వావలంబన, సంక్షేమం కోసం ప్రత్యేకంగా సిక్కుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అండగా నిలవాలని ప్రతినిధులు మంత్రిని కోరారు. సిక్కు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

# తూకంలో మోసం..

## రేషన్ దారులకు పంగనామాలు..!

ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 06:
తూకంలో మోసం చేస్తూ.. రేషన్ దారులకు పంగనామాలు పెడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. మండలంలోని మహానంది గ్రామపంచాయతీ లో రేషన్ పంపిణీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని నెలల నుంచి ఇదే తంతు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. బుధవారం రేషన్ పంపిణీ విషయంలో అవకతవకలు చోటు చేసుకున్నట్లు వినియోగదారుల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి తెలిసింది. ఇవి ఏమీ పట్టినట్లు వ్యవహరిస్తూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తూ 15 కేజీలు వేయాల్సిన కార్డుదారులకు పది నుంచి 12 కిలోల లోపలనే రేషన్ తూకం వేస్తూ వినియోగదారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. రేషన్ తూకం వేసే ముందు 2 నుండి 3 కిలోలు ఉండే డబ్బాతో కలిపి తూకం వేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కిలో కందిపప్పు కు ఐదు రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. కందిపప్పు అదనంగా కావాలంటే మరో ప్యాకెట్ కు వంద రూపాయలు వసూల్



చేస్తున్నట్లు తెలిసింది. ప్రశ్నించిన వారిని మీ ఇష్టం వచ్చిన చోట చెప్పుకోండి అని బదులిస్తూ వినియోగదారులను బెదిరింపులకు గురి చేస్తు యధావిధిగా తనకు ఇష్టం వచ్చినట్లు తూకాల్లో మోసం చేస్తున్నట్లు తెలుస్తుంది. మహానందిలో అధిక భాగం గిరిజనులు మరియు నిరక్షరాస్యులు ఉండటం వారికి వరంగా మారినట్లు తెలుస్తుంది. కూత వేటు దూరంలో మండల రెవెన్యూ కార్యాలయం ఉన్న పర్యవేక్షణలోప కారణంగా ఆడింది ఆటగా పాడింది పాటగా లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తూ ఏదేచ్ఛగా ఇలాంటివి ఇక్కడ సర్వసాధారణం అన్నట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. మరి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్డుదారుల నుంచి గుసగుసలు వినవస్తున్నాయి.

# భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

రూ.వెయ్యి కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈ పాలసీ తీసుకొచ్చారు. డ్రోన్ రంగంలో 40 వేల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. డ్రోన్ రంగంలో పరిశోధన చేసే విద్యా సంస్థలకు రూ.20 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ఏపీ కేబినెట్ నిర్ణయించిందన్నారు. ప్రపంచ డ్రోన్ డెస్టినేషన్గా ఆంధ్రప్రదేశ్, డ్రోన్ హబ్గా ఓర్వకల్లును అభివృద్ధి చేయబోతున్నట్లు వెల్లడించారు. 300 ఎకరాల్లో డ్రోన్ తయారీ, టెస్టింగ్, ఆర్అండ్డీ ఫెసిలిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. 25 వేల మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇస్తామన్నారు. 50 డ్రోన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఎక్సైజ్ చట్ట సవరణ ముసాయిదాకు, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ లక్ష్యాల సాధనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చారు. జ్యుడిషియల్ అధికారుల ఉద్యోగ విరమణ వయసు 61కి పెంచుతూ ఆమోదం దక్కింది. 2024 నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా చట్ట సవరణ బిల్లుకు ఆమోదం ఇచ్చింది. అలాగే, ఏపీ రాజధాని ప్రాంత పరిధిని పునరుద్ధరిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో సీఆర్డీఏ పరిధిని కుదించి అమరావతి ప్రాంతానికి పరిమితం చేయగా.. దాన్ని పునరుద్ధరించింది. సీఆర్డీఏ పరిధిని 8,352 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ఆమోద ముద్ర వేసింది. సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1069.55 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, పల్నాడు జిల్లా 92 గ్రామాలు, బాపట్ల జిల్లా 62 గ్రామాలను తిరిగి సీఆర్డీఏ పరిధిలోకి వచ్చేలా కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 11 మండలాల్లోని 154 గ్రామాలను తిరిగి సీఆర్డీఏ పరిధిలోకి తెచ్చింది. కుప్పం, పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కుప్పం డెవలప్మెంట్ అథారిటీ 4 మండలాలను, ఓ మున్సిపాలిటీని కవర్ చేస్తూ స్థాపించబడింది. ఎపి ఎక్సైజ్ సవరణ ఆర్డినెన్స్ - 2024కు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అలాగే, ఏపీ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. పీ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ 1984 సవరణ - జ్యుడీషియల్ ఆఫీసర్ల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 61 ఏళ్లకు పెంచేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ సవరణ 2024 నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ డిస్బర్షల్ - 2024 - 25 విద్యా సంవత్సరం నుంచి పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ను విద్యార్థుల కళాశాల బ్యాంక్ అకౌంట్లో నేరుగా జమ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీని ద్వారా విద్యార్థులకు త్వరగా సర్టిఫికెట్లు జారీకి మార్గం సుగమం అవుతుంది. అలాగే, 2014 - 15 నుంచి 2018 -19 మధ్య పూర్తైన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి పనుల బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అటు, 2024, జూన్ 24 నుంచి అక్టోబర్ 23 వరకూ తీసుకున్న మంత్రివర్గ నిర్ణయాలపైనా రూపొందించిన నివేదికలపైనా చర్చ సాగింది. రాష్ట్ర అభివృద్ధి, సామాజిక సంక్షేమం, విద్యా రంగం తదితర విషయాల్లో సీఎం అమాత్యులకు దిశానిర్దేశర చేశారు.

# కొలువుదీరిన టిటిడి నూతన పాలకమండలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని బి.ఆర్. నాయుడు తెలియజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం బుధవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్లో ఆయన తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే పాలకమండలి ముందు చాలా సవాళ్లు ఉన్నాయన్నారు. రాబోవు పాలకమండలి సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. తిరుమల పవిత్రను కాపాడే విధంగా నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. సామాన్య భక్తులకు త్వరగతిన దర్శనం కల్పించే విదంగా చర్యలు తీసుకుంటామని వ్యాఖ్యానించారు. శ్రీవాణి ట్రస్టు నుంచి నిధులు దారి మళ్ళాయని ప్రజల్లో అపోహ ఉందని.. శ్రీవాణి ట్రస్టు నిధుల మళ్లింపుపై విజిలెన్స్ నివేదిక వచ్చిన అనంతరం ట్రస్టు కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ క్రమంలోనే బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమలలో అన్యమత ప్రచార నిర్వహణని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని తేల్చి చెప్పారు. అన్యమత ఉద్యోగులు కొనసాగింపుపై బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సీఎం ఆదేశాలు మేరకు టీటీడీలో ఇప్పటికే ప్రక్షాళన మొదలైందని వెల్లడించారు. ఆస్పత్రుల నిర్వహణ టీటీడీకి భారంగా మారిందని చెప్పుకొచ్చారు. శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తులకు సేవ చేసేందుకు మీడియాతో సహా ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత నెలలో బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధికారులు సమిష్టి కృషిని కొనసాగించాలని ఆకాంక్షించారు. అంతకుముందు టీటీడీ సీనియర్ అధికారులందరితో చైర్మన్ పరిచయ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు టీటీడీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సమర్పించారు. తిరుమల ఆలయం, స్థానిక దేవాలయాలు, అన్నప్రసాదం, విజిలెన్స్, ఆరోగ్యం, రవాణా, ఐటి, గోశాల, ఉద్యానవనం, అటవీ శాఖ, విద్యాసంస్థలు ప్రాముఖ్యతను వివరించారు. ఆసుపత్రులు, మెడికల్, పిఆర్ వింగ్, రిసెప్షన్, కళ్యాణకట్ట, హిందూ ధార్మిక ప్రాజెక్టులు, యాత్రికుల దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలను చూసుకోవడంతో పాటు తమ నిబద్ధతతో సంస్థ ఖ్యాతిని అన్ని స్థాయిలలో ముందుకు తీసుకెళ్లడంలో ఉద్యోగులు అంకితభావంతో ఉన్నారని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో శ్రీ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీ శ్రీధర్, డిఎల్ఓ శ్రీ వరప్రసాదరావు, సిఈ శ్రీ సత్యనారాయణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐదు నెలల్లోనే ప్రజలకు చుక్కలు

## విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా మూడు రోజులు నిరసనలు :వైఎస్ షర్మిల

అమరావతి,నవంబర్6 ఆంధ్ర ప్రగతి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే ప్రజలకు చుక్కలు చూపిస్తుందని కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ బుధవారం విజయవాడలో ధర్నాకు దిగి లాంతర్లు చేతపట్టి వినూత్న రీతిలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచుతున్నందుకు నిరసనగా మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. ఐదు నెలల పాలనలోనే ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు చంద్రబాబు అంటూ మండిపడ్డారు. ఇది హై ఓల్టేజీ షాక్ కాకపోతే ఏమిటి అని ప్రశ్నించారు. ఈనెల నుంచి ఆరు వేల కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. మరో 11 వేల కోట్ల రూపాయల భారం కూడా త్వరలోనే ప్రజలపై మోపేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మొత్తం 17 వేల కోట్ల రూపాయలను ప్రజల నుంచి విద్యుత్ ఛార్జీల పేరుతో వసూలు చేయబోతున్నారన్నారు. "ప్రజలు ఏం పాపం చేశారు.. మీకు ఓట్లు వేసి గెలిపించడమే పాపమా" అంటూ నిలదీశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారని... 35వేల కోట్ల భారం మోపారని చంద్రబాబు ఏడ్చినంత పని చేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉంటే ఈ భారాలు ఉండేవి కాదని, 30 శాతం ఛార్జీలు తగ్గించే వాళ్లమని నాడు చంద్రబాబు చెప్పారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంపై ఇన్ని మాటలు మాట్లాడిన చంద్రబాబు.. నాలుగు నెలల్లోనే 17వేల కోట్ల భారం ప్రజలపై ఎలా మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం "నాలుగు రూపాయలకు కొనాల్సిన కరెంటును 9 రూపాయలకు జగన్ కొన్నారని మీరే చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఇన్ని తప్పులు చేస్తే.. ప్రజలు మీకు అధికారం ఇచ్చారు. ఆ ప్రభుత్వం తప్పులు చేస్తే.. విచారించి వారిని శిక్షించాలే గానీ, ప్రజలపై భారాలు మోపడం ఏమిటి. నిత్యావసర వస్తువులు పెరిగాయి. వరదలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితులలో ప్రజలపై ఇన్ని వేల కోట్లు భారం మోపడం తగునా. పదేళ్లుగా మన ఎంపీలు అందరూ బీజేపీకే ఊడిగం చేస్తున్నారు. మరి ఏపీ ప్రజలకు కష్టం వస్తే.. బీజేపీ ఎందుకు ఆదుకోవడం లేదు. ఇంత అన్యాయం జరుగుతున్నా చంద్రబాబు ఎందుకు కేంద్రాన్ని నిలదీయరు. ఇప్పుడు తీసుకున్న నిర్ణయాలను రోల్ బ్యాక్ చేయాలని చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాం. ఆరు వేల కోట్ల రూపాయల విద్యుత్ వసూళ్లకు ఈ.ఆర్.సి కి చంద్రబాబు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈ నిర్ణయాలను మొత్తం చంద్రబాబు ఉపసంహరించుకోవాలి" అని డిమాండ్ చేశారు.

# అగ్ని ప్రమాద బాధితులకు జనసేన నాయకులు చేయూత



ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 06:
మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని కొత్తకోటలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంబంధించి నష్టపోయిన బాధితులను జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మా రెడ్డి రామయ్య, నల్లబోతుల మల్లికార్జున బుధవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయంగా రూ. 5 వేలు నగదు,రెండు బియ్యం బస్తాలు,నిత్యవసర సరుకులు, కూరగాయలు, చీరలు అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పిన బాధితులకు ప్రతి ఒక్కరు సహాయం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురునాథ రాయల్, బొనాసి ప్రసాద్, శివ, వేణు, శివ నాగిరెడ్డి, దుర్గ, శ్రీను, శివుడు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి 4 వార్డు కౌన్సిలర్ టిడిపిలో చేరిక

**-వైసీపీకి నంద్యాలలో ఎదురుగాలులు.**



ఆంధ్ర ప్రగతికి నంద్యాల నవంబర్ 06:
నంద్యాల 4 వార్డ్ టిడిపి ఇంచార్జ్ మజీద్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి 4 వార్డ్ కౌన్సిలర్ తబ్రేజ్ నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సమక్షంలో టీడీపీలో చేరిక వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఫిరోజ్ ..ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు వైసీపీని వీడే పరిస్థితికి వైసిపి పార్టీ దిగజారిందని , వైసిపి పార్టీ నాయకులని కార్యకర్తలను విస్మరించిందని వారికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు . కాబట్టి వారి ఆత్మ అభిమానం చంపుకొని వైసీపీలో పని చేయలేక 4 వార్డ్ కౌన్సిలర్ తబ్రేజ్ టిడిపిలో చేరారన్నారు టిడిపిలో వారికి సూముచిత స్థానం కల్పించి ప్రజలకు మంచి పరిపాలన అందించి నంద్యాలను అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా కౌన్సిలర్ తబ్రేజ్ మరియు 4 వార్డ్ టిడిపి నాయకులు కలిసికట్టుగా పనిచేసే తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని రానున్న మున్సిపల్ ఎలక్షన్లో నంద్యాల ని క్లీన్ షిప్ చేయాలని ఎన్ఎండి ఫిరోజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మరియు ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు దియ్యాల రంగ ప్రసాద్ హరి మిద్దె ఉసేని , ఉప్పరి సురేష్ కుమార్ అక్బర్ స్వామి నాయక్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 14 విభాగంలో శాంతినికేతన్ విద్యార్థుల ప్రభంజనం




ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06:
నంద్యాల క్రాంతి నగర్ లోని శ్రీ శాంతినికేతన్ సి బి ఎస్ ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు కే .మోహిత్ కుమార్ రెడ్డి మరియు ఎస్. వెంకట మహేష్ లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ వారు ఈనెల 5వ తారీఖున కర్నూల్ నందు నిర్వహించిన అండర్- 14 క్రికెట్ విభాగంలో పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ సుధాకర్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కాబడిన తమ విద్యార్థులకు తమ పాఠశాల యందు అభి నందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ సుధాకర్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడలు విద్యార్థుల్లో శారీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలియజేశారు. అలాగే తమ విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి పోటీల్లో పాల్గొన్నటువంటి విద్యార్థుల భవిష్యత్తు ఉద్యోగ జీవితానికి ఈ క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఎంపిక కాబడిన విద్యార్థులు ఈనెల 25వ తారీఖున కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కాబడిన విద్యార్థులను, వారికి ఉత్తమ శిక్షణ నిచ్చిన కోచ్ ఎస్ .ఎం. ఫరూక్ ని అభినందించారు.?

# స్పోర్ట్స్ కోట 3శాతానికి పెంపునకు పీ ఈ టీ పుల్లయ్య హర్షణయం



ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు నవంబర్ 06 :
ఆత్మకూరు పట్టణం పీ ఈ టీ పుల్లయ్య మాట్లాడుతూ ఉద్యోగ నియమంకాలలో స్పోర్ట్స్ కోట నుంచి మూడు శాతాన్ని కి పెంచడంతో ఆత్మకూర్ పీఈటి పుల్లయ్య హర్ష వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడారంగ సమీక్ష సమావేశంలో క్రీడా రంగానికి సంబంధించిన పలు ప్రోత్సాహాలు పెంచడం పట్ల ఆత్మకూరు ప్రవేట్ వ్యాయామ ఉపాధ్యాయులు మరియు చాలా సంతోషం దగ్గ విషయమని అలాగే ఒలంపిక్స్ ఏసియన్ గేమ్స్ వరల్డ్ ఛాంపియన్స్ లో పాల్గొనే వారికి గతం లో కన్నా రెట్టింపు స్థాయి ప్రోస్తావాలు పెంచడం పట్ల క్రీడాకారులకు . తల్లిదండ్రుల్లోనూ ఉత్సాహం పెరుగుతుండడంతో. క్రీడాకారుల కలను ఎక్కడైతే ప్రోత్సహిస్తారు. రంగంలో కొత్త ఊపు ని స్తుంది అన్నారు. ఆశ భావాన్ని కలగజేస్తుంది అని గత ప్రభుత్వంలో తీసుకురాని క్రీడా పెంపు శాతాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు తీసుకురావడంతో ఆత్మకూర్ పిఈటి పుల్లయ్య హర్ష వ్యక్తం చేశారు.

# వ్యాచరచన- వక్తృత్వ పోటీలలో గెలుపొందిన పోలీసు పిల్లలకు, పోలీసులకు నగదు

**-బహుమతులను అందజేసిన జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.యుగందర్**







ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 06:
నంద్యాల జిల్లాలోని వివిద పాఠశాలలో మరియు కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు,సబ్ డివిజన్ స్థాయిలో ఎంపికైన సిబ్బందికి మరియు పోలీసు కుటుంబాలలోని పిల్లలకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో "సైబర్ నేరాల నివారణలో విద్యార్థుల పాత్ర" అనే అంశం మీద వ్యాచరచన, మరియ వక్తృత్వ పోటీలు, జిల్లాలోని పోలీసులకు "పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు" అనే అంశం మీద వ్యాచరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించిన విషయము అందరికీ విధితమే ఇందులో గెలుపొందిన విజేతలకు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగందర్ బాబు చేతులమీదుగా నేడు నగదు బహుమతులు అందజేయడం జరిగింది.
ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ స్కూల్ స్థాయి నుంచి దేశ భద్రత కొరకు సమాజంలో ప్రజల రక్షణ కొరకు పోలీసులు మరియు సైనికులు ప్రాణాలు అర్పిస్తున్నారని వారి ప్రాణ త్యాగం వలన మనం ఈరోజు సురక్షితంగా జీవిస్తున్నామని అలాంటి వారిని స్మరించుకొనడం మన భాద్యత అని,పోలీసులు ప్రజలకు(సమాజానికి) చేయుచున్న సేవలు విద్యార్థి దశలోనే అవగాహన కల్పించి పోలీసులు ప్రజలకు(సమాజానికి)మరింత చేరువ కావాలనే సదుద్ధేశంతో మరియు వారిలోని విజ్ఞానాన్ని వెలికి తీయుటకు ఈ పోటీలు నిర్వహించడం జరిగిందని,పోలీసుల బాధ్యతలు వారుచేయు విధులు మొదలగునవి మీరందరూ తెలుసుకొని ఉంటారని ఆశిస్తూ మీరు బాగా చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి మీ తల్లిదండ్రులకు మనిషి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని మరియు పోలీసులు వృత్తినైపుణ్యం చూపుతూ ముందుకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నానని తెలియజేశారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ గారు మొదటి బహుమతి 5000 వేల రూపాయలు, రెండవ బహుమతి 3000 వేల రూపాయలు, మూడవ బహుమతి 2000 వేల రూపాయలు అందజేశారు.
పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై పోలీసు సిబ్బంది వ్రాసిన వ్యాసరచన పోటీలోమొదటి బహుమతి హెచ్.సూర్య ప్రతాప్ నాయక్ జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్
రెండవ బహుమతి జి సి వెంకటన్న చాగలమర్రి పోలీస్ స్టేషన్ ,మూడవ బహుమతి వై.కళాజ్యోతి నంద్యాల 3 టౌన్ పోలీస్ స్టేషన్ పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై పోలీసు సిబ్బంది పాల్గొన్న వకృత్వ పోటీలో.. మొదటి బహుమతి కె.దాదా పీరయ్య ఆర్మడు రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్ నంద్యాల రెండవ బహుమతి ఇంతియాజ్ ఆర్మూర్ రిజర్వ్ పోలీస్ మూడవ బహుమతి చక్రధర్ బేతంచెర్ల పోలీస్ స్టేషన్
పోలీసు సిబ్బంది యొక్క పిల్లలు పాల్గొన్న సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే వ్యాసరచన పోటీలోమొదటి స్థానం ఎస్. సాత్విక్ రెండవ బహుమతి పి.హిమవర్ష మూడవ బహుమతి ఎం.రూపశ్రీ పోలీసు సిబ్బంది యొక్క పిల్లలు పాల్గొన్న సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే వకృత్వ పోటీలోమొదటి బహుమతి డి.కళ్యాణిభారతిరెండవ బహుమతి యశ్వంత్ రెడ్డి మూడవ బహుమతి డి.హుస్సేన్ భాష కాలేజీ విద్యార్థులు పాల్గొన్న సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే వ్యాసరచన పోటీలోమొదటి బహుమతి ఎస్.అయేషా ఆదిత్యా జూనియర్ కాలేజ్ ఆత్మకూరు.రెండవ బహుమతి భవిత శ్రీ గోస్పాడు మూడవ బహుమతి .సునయన బండిఆత్మకూరు జూనియర్ కాలేజ్.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తో పాటు రిజర్వు ఇన్స్పెక్టర్లు మంజునాథ్ ,శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నవంబర్ 9వ తేదీ తేదీన న జరుగు సిపిఎం పార్టీ నంద్యాల మండల మహాసభను జయప్రదం చేయండి





ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06:
నవంబర్ 9 వ తేదీ నంద్యాల మండల సిపిఎం మహాసభ నంద్యాల పట్టణంలోని నరసింహయ్య భవనంలో జరుగుతుందని సిపిఎం పార్టీ నంద్యాల మండల మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ నాయకులు వి, బాల వెంకట్ తెలిపారు. బుధవారం సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం సిపిఎం పార్టీ పట్టణ నాయకులు రత్నమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో సిపిఎం పార్టీ నంద్యాల మండల మూడో మహాసభలు నిర్వహించడం జరుగుతుంది. ఈ మహాసభలో గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన పోరాటాల పైన చర్చించి, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పాలక ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్నటువంటి బాలలకు వ్యతిరేకంగా ఏ విధమైన పోరాటాలు చేయాలని పలు అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి ప్రతి పార్టీ సభ్యుడు,, సానుభూతిపరులు అభిమానులు మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పాల్గొని జయప్రదం చేసి పాలకుల విధానాల పైన, రోజురోజుకు ప్రజలపై వేస్తున్న బారాలకు వ్యతిరేకంగా, నిరుద్యోగ సమస్య పరిష్కారం కొరకు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాలకు సిద్ధం చేసేందుకు ఈ మహాసభలు ఉపయోగపడతాయని వారన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి రమేష్ కుమార్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు హాజరవుతున్నారు అని అన్నారు. ఈ సమావేశం లో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కృష్ణ సంజీవ రాయుడు యూసఫ్ , తదితరులు పాల్గొన్నారు.


# కార్యకర్తల బాగే సీఎం చంద్రబాబు లక్ష్యం.!

**-వైసీపీ ఐదేళ్లలో చేయని అభివృద్ధిని ఐదు నెలల్లోనే చేసి చూపాం.**

**-ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలి.**

**-నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06:నంద్యాల టౌన్ 40 వార్డులో నంద్యాల టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ కార్యకర్తల బాగే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని, ఇందుకోసం జీవితా బీమాతో కూడిన సభ్వత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారని వెల్లడించారు. పార్టీ సభ్యత్వం కేవలం రూ. 100. లేనని, ఈ సభ్యత్వంపై రూ. 5 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తున్నారని తెలిపారు. ప్రమాదవశాత్తూ ఎవరైనా మృతిచెందితే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల ఇన్స్యూరెన్స్ తో పాటు మట్టి ఖర్చుల కోసం మరో రూ. 10 వేలు ఇవ్వనున్నట్లు ఫిరోజ్ తెలిపారు. ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలని తెలియచేసారు. తెదేపా సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. సభ్యత్వ నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి కుటుంబ సభ్యులకు, బంధువులకు సభ్యత్వం చేయించాలని. భవిష్యత్ లో కార్యకర్తలకు, నాయకులకు ఏవైనా పదవులు రావాలన్నా.. కచ్చితంగా సభ్యత్వ నమోదు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు . వైసీపీ ఐదేళ్లలో చేయని అభివృద్ధిని ఐదు నెలల్లోనే చేసి చూపాం మని రాష్ట్రవ్యాప్తంగా ఒక పక్క సంక్షేమం తో పాటు అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం దూసుకెళ్తోందిని ఎన్ఎండి ఫిరోజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పఠాన్ హర్షద్ , మునియార్ నవాజ్ అబ్బాస్ దర్గా జాఫర్ , దర్గా జాహిద్ , పఠాన్ జాకీర్ ముసం , యూసుఫ్ జగ్గును మొహధర్ , షాహిన్ షా అశోక్ ఎల్లయ్య , అమీర్ కామిని మల్లికార్జున , అయూబ్ , కిషన్ సెట్ సునీల్ ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

# కడప ఎస్పీపై బదిలీ వేటు

(మొదటి పేజి తరువాయి)

రవీంద్రరెడ్డిని అరెస్టు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పోలీసులపై ఫిర్యాదులు వచ్చాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితపై సామాజిక మాధ్యమాల్లో రవీంద్రరెడ్డి అసభ్యకర పోస్టులు పెట్టిన సంగతి తెలిసిందే. వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రరెడ్డి పోలీసుల నుంచి తప్పించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులే తప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో అత్యంత అసభ్యకరంగా పోస్టులు పెట్టిన రవీంద్రరెడ్డిని పోలీసులు వదిలేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో రవీంద్రను పట్టుకునేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పులివెందులకు చెందిన రవీంద్రరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలేయడం తీవ్ర దుమారం రేపుతోంది. వైకాపా ఎంపీ అవినాశ్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్న రవీంద్ర.. వైకాపా హయాం నుంచి ఇప్పటి వరకు తెదేపా నేతలపై తీవ్ర పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా.. అదే తీరు కొనసాగించాడు. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం సాయంత్రం కడప పోలీసులు రవీంద్రను అదుపులోకి తీసుకొని తాలూకా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అది కూడా పులివెందులకు చెందిన ఓ వైకాపా నాయకుడి సూచనల మేరకు అదుపులోకి తీసుకొని 41ఏ నోటీసులు ఇచ్చి వదిలేశారు. నోటీసులు ఇచ్చి వదిలేసిన సమయంలో రవీంద్రరెడ్డిని మరో కేసులో అదుపులోకి తీసుకోవడానికి రాజంపేట పోలీసులు నిన్న రాత్రి కడప తాలూకా పోలీస్‌స్టేషన్ దగ్గర సిద్ధంగా ఉన్నారు. కానీ, కడప పోలీసులు నేరుగా అతడిని రాజంపేట పోలీసులకు అప్పగించకుండా బయటకు పంపించేశారు. రాజంపేట పోలీసుల కళ్లుగప్పి రవీంద్ర అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. ఎస్పీ హర్షవర్ధన్ రాజుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కర్నూల్ రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్ వెంటనే కడపకు వెళ్లి.. కేసు వివరాలు ఆరా తీయాలని సీఎం ఆదేశించారు. పులివెందుల వెళ్లి రవీంద్ర భార్య, పిల్లల్ని అదుపులోకి తీసుకొని సీకే దిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. భర్త ఆచూకీ చెప్పాలని ఆమెను విచారించినట్లు తెలుస్తోంది. వైకాపా నేత కనుసన్నల్లో రవీంద్ర ఉండటంతో అతడికి కూడా పోలీసులు ఫోన్ చేసి, ఆరా తీసినట్లు సమాచారం.

# 18 సం"నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06: 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్యం ప్రాథమిక కర్తవ్యం నోడల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి
స్థానిక శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో బుధవారం భారత ఎన్నికల సంఘం ఆదేశాలు ప్రకారం లిఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో యువతకు ఓటు హక్కు పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రామకృష్ణ విద్యా సంస్థల అధినేత చైర్మన్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు, యువత ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశము ఎక్కువ జనాభా ఉన్నటువంటి దేశం యువత ఎక్కువగా ఉన్న దేశం కూడా కాబట్టి యువత ఎంతో చైతన్యవంతంగా 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా అలసత్వం వహించకుండా తప్పనిసరిగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి. ఇది ఎంతో అవసరం కూడా. దీనికోసం ప్రభుత్వం అధికారులు అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. యువత బాధ్యత తీసుకోవడం ప్రాథమిక కర్తవ్యం అని అన్నారు. నంద్యాల జిల్లా ఏఎస్ఓ ప్రహ్లాద మాట్లాడుతూ ఓటరు చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని దాని కొరకు యువత మేల్కొనాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరము ఈ కార్యక్రమము దేశవ్యాప్తంగా ఎంతో డబ్బును ఖర్చుపెట్టి యువతను చైతన్యం చేయడానికి భారత ఎన్నికల సంఘం కృషి చేస్తుంది కానీ యువత నిర్లక్ష్యం కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదు అందువలన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి యువత ఓటు హక్కును నమోదు చేసుకోవడం తన ప్రాథమిక హక్కుగా భావించాలి. సంవత్సరం అంతా ఈ కార్యక్రమం జరిగిన





తర్వాత జనవరి 2025 సంవత్సరము న తుది జాబితా వెలువబడుతుంది అప్పుడు మీ పేర్లు ఓటరు లిస్టులో ఉన్నాయో లేదో చెక్ చేసుకోవచ్చు. విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఒక ఐదు పైసలు కూడా ఖర్చు కాదు అందువల్ల ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. అప్పుడు ఎన్నికల సమయంలో మంచి నాయకులను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది. యువత కులమతాలకతీతంగా అందరూ ఓటరుగా నమోదు చేసుకోండి అని పిలుపునిచ్చారు. సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తమ కళాశాలలో యువతకు ఓటు హక్కు పై అవగాహన కలిగించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని దీని వలన డిగ్రీ మొదటి సంవత్సరం చేరిన ప్రతి విద్యార్థి 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇది ప్రజాస్వామ్య దేశంలో ఎంతో విలువైన అంశమని ఆ చైతన్యము విద్యార్థులలో రావాలని దేశాభివృద్ధిలో యువత పాత్ర గుర్తించాలని అలాగే వారి యొక్క ఓటు హక్కు కూడా ఎంతో విలువైనదని అది దేశ భవిష్యత్తును సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు తమ ప్రాథమిక కర్తవ్యం గా భావించి ఇప్పటికైనా నమోదు చేసుకొని వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని దానికి సంబంధించిన అవగాహన వివరాలు నోడల్ ఆఫీసర్ గా వచ్చిన శ్రీకాంత్ రెడ్డి మీకు వివరించారని కాబట్టి తప్పనిసరిగా ఈ అవగాహన కార్యక్రమం ద్వారా స్ఫూర్తిని పొంది ఓటరుగా నమోదు చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ తహశీల్దార్ విజయ్ శేఖర్ యువత కి ఓటరు కార్డు లేకపోతే మీరు విదేశాల్లో వెళ్ళలేరు అలాగే అందరూ ఓటు హక్కు ని విన్యోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన అనేక సందేహాలకు ఏ ఎస్ ఓ ప్రహ్లాద చక్కగా వివరించి చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులను కళాశాల యాజమాన్యం ఘనంగా మెమెంటో శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెబివి సుబ్బయ్య మరియు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ రేవతి, బాలు,హుస్సేన్ బాబు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అహోబిలం నల్లమల అడవుల్లో
# పెద్దపులిని ఢీకొట్టిన కారు.

ఆంధ్ర ప్రగతి రుద్రవరం నవంబర్ 06: రుద్రవరం అటవీ రేంజి పరిధిలోని అహోబిలం నల్లమల అడవుల్లో అహోబిలం వెళ్లే రోడ్డులో పెద్దపులిని కారు ఢీకొట్టినట్లు సమాచారం దీంతో కారుకు డ్యామేజ్ కాగా పెద్దపులి గాయపడి నట్లు సమాచారం. దీంతో పులి గాయపడి అడవిలోకి గాయాలతో



వెళ్లినట్లు సమాచారం.సంఘటన జరిగిన సమాచారం తెలుసుకున్న రుద్రవరం రేంజి సబ్ డి ఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి, రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి ముత్తు జావలి, సిబ్బంది ప్రొటెక్షన్ వాచర్లు సంఘటనా స్థలము చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

# ప్రపంచ మత్స్యకారుల దినోత్సవన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించండి.

**-జిల్లా కలెక్టర్ కు విన్నవించిన ఏపి బెస్త సంఘం రాయలసీమ ఇంచార్జి గగ్గెర వెంకటరమణయ్య.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించాలని కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నాడు ఫిషరీస్ జె. డి. రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో బెస్త సంఘం నాయకులు జిల్లా కలెక్టర్



శ్రీమతి రాజకుమారి గణియా కి వినతి పత్రం సమర్పించారు.అనంతరం మార్కెట్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంను ప్రతి సంవత్సరము రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నదని ఇక్కడ కూడ మన ఉమ్మడి జిల్లా కర్నూలులో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల నవంబర్ 21 ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంను నూతనంగా ఏర్పడిన నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంను నంద్యాలలో నిర్వహిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం జిల్లా అధ్యక్షులు పాణ్యం సుబ్బయ్య, జిల్లా నాయకులు ప్రసాద్, వెంకటేశ్వర విద్యా మందిరం కరస్పాండెంట్ వెంకటరాముడు,, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో
# చిరు వ్యాపారులకు భరోసా.!

**-ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ధన్యవాదములు తెలిపిన చిరు వ్యాపారులు.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06: నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డును, ఆసుపత్రి రోగులను నమ్ముకొని జీవిస్తున్న 27 కుటుంబాల చిరు వ్యాపారుల కళ్ళలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆనందం నింపారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డు ఫుట్ ఫాత్ ను ఆక్రమించి



ప్రయాణికులకు, ఆసుపత్రి రోగులకు ఆటంకం కలిగిస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల తాత్కాలిక రేకుల షెడ్లు, తోపుడు బండ్లను రెండు నెలల క్రితం తొలగించారు. దీంతో నిరుపేద 27 కుటుంబాల భాధితులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని నెల రోజుల క్రితం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో కలిసి తమ గోడు చెప్పుకున్నారు. మీ సమస్య ఎంపీ శబరి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. గత నెల 26 తేదీన టీడీపీ సభ్యత్వం నమోదు ప్రారంభం కోసం నంద్యాలకు వచ్చిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కలిసి ఆసుపత్రి ముందున్న నిరుపేద చిరు వ్యాపారులు తమ గోడు చెప్పుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని నమ్ముకొని చాలీ చాలని, అర్ధాకలితో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు అంగల్లు తొలగించడంతో అనేక కష్టాలు పడుతున్నామని, న్యాయం చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దృష్టికి తెచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఎంపీ శబరి భాధితుల ముందే నంద్యాల మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెండెంట్, జిల్లా ఎస్. పి ఆదిరాజ్ సింగ్ రాణా లకు ఫోన్ చేసి భాదితుల కష్టాలు వివరించి వారికీ న్యాయం చేయాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా ఎస్. పి ఆదిరాజ్ సింగ్ రాణా భాధితులు సోమవారం తన కార్యాలయంకు వచ్చి తనను కలవాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి చెప్పారు. ఎంపీ శబరి చెప్పిన మేరకు జిల్లా ఎస్. పి ని కలువగా అన్ని వివరాలు అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్ పి రోడ్డు ప్రయాణికులకు, ఆసుపత్రి రోగులకు ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా, రేకుల షెడ్లు వేయకుండా తోపుడు బండ్లు పెట్టుకోవాలని చెప్పడంతో తాము అంగీకరించి ఆసుపత్రి ముందు ఎవరికీ ఇబ్బంది లేకుండా చిరు అంగల్లు పెట్టుకొని కుటుంబ పోషణ జరుపుకుంటున్నామని, మాకు సహకరించిన జిల్లా ఎస్. పి కి, ప్రత్యేక చొరవ తీసుకొని మా నిరుపేదలకు అండగా నిలిచిన మా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకుంటున్నామని ఆసుపత్రి ముందు ఉన్న చిరు అంగల్ల నాయకులు షేక్ మాసమ్ వలి, కురువ రాముడు, బజ్జీల బాషా, టెంకాయల శివ తదితరులు బుధవారం తెలిపారు.

# గిరిజన గురుకులాల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల ధర్నాకు తరలిరండి

**-గిరిజన గురుకుల ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.**

**-గురుకుల ఉపాధ్యాయులకు అణచివేసేందుకు ప్రభుత్వ కుట్ర.**

**-ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06: విజయవాడ ధర్నా చౌక్ లో జరుగుతున్న గిరిజన గురుకులాల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల ధర్నాకు గిరిజన ప్రజా సమాఖ్య సంపూర్ణ మద్దతు తెలుపుతూ ధర్నాలో పాల్గొంటున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున గిరిజనులు, వివిధ సంఘ నేతలు ప్రతి ఒక్కరు పాల్గొని వారికి అండగా నిలిచి ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు పోరాటం సాగించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ గిరిజనులకు జిపిఎస్ కార్యాలయం నుండి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ అర్ధాకలితో 15 ఏళ్లుగా గురుకులాల్లో చాలీచాలని జీతాలతో విద్యాబోధన అందిస్తూ విద్యార్థులకు క్రమశిక్షణగా నిలిచిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం మెగా డీఎస్సీ నుంచి మినహాయించాలని కాంట్రాక్ట్ రెగ్యులర్ టీచర్స్ గా కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో గిరిజన గురుకులాల్లో మాత్రమే ఔట్సోర్సింగ్ విధానం అమలు అవుతుందని, గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో దాదాపు 15 ఏళ్లుగా 1633 మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తూ చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారని గుర్తు చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోయినా ఎన్నో ఏళ్లుగా గురుకులలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చే బహుమతి ఇదేనానని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల పైన పడాల్సింది పోయి పోస్టులను మెగా డీఎస్సీలో భర్తీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు. అదే జరిగితే



వారంతా బ్రతుకుతెరువు కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు, వివిధ గిరిజన సంఘ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవాడ ధర్నా చౌక్ లో జరుగుతున్న ధర్నాలో పాల్గొని గిరిజన ఉపాధ్యాయుల గౌరవం నిలబెట్టాలన్నారు.

# మైనార్టీ సమస్యలపై ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**-వక్ఫ్ బోర్డ్ భూములను పరిరక్షించాలి.ఇన్సాఫ్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 06: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీ లకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వక్ఫ్ బోర్డ్ ఆస్తులను హక్కులను పరిరక్షించాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ బాబా ఫక్రుద్దీన్. డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా తంజిమ్ ఇన్సాఫ్ 11వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా సిపిఐ కార్యాలయం వద్ద ఇన్సాఫ్ సీనియర్ నాయకులు ఎస్.సలాం ఖాన్ జండా ఆవిష్కరించడం జరిగిందని ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ సీనియర్ నాయకులు. ఎస్ రియాజ్. రాష్ట్ర సమితి సభ్యులు. ఎస్ జిలాని భాష.జిల్లా నాయకులు.ఎస్. మజీద్ మియా. డప్పు ఖలీల్. ఎస్ మా భాష. ఎస్ కలాం. ఎస్ మమ్మద్ అలీ. ఎస్ సిద్దిక్



భాష. డి.గోకారి.పాల్గొన్నారు.ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ.. ఆల్ ఇండియా తంజీమ్ ఇన్సాఫ్ 2013 ఉత్తర ప్రదేశ్ లోని అలీఘర్ రాష్ట్రంలో దేశంలో మైనార్టీలకు విద్య ఉపాధి కోసం ఆవిర్భవించిందని నాటి నుండి నేటి వరకు అనేక రాష్ట్రాలలో మైనార్టీల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిన ఘనత ఇన్సాఫ్ కే దక్కుతుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనార్టీలపై అనేక సందర్భాల్లో దాడులు చేస్తూ వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ దేశంలో ఏం జరిగినా అవి మైనార్టీలపై ఆరోపణలు గుప్పిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని. వక్ఫ్ బోర్డు ఆస్తుల ఆదాయం వల్ల మైనార్టీలకు విద్య ఉపాధి కోసం ఉపయోగించబడుతుందని వాటిని కూడా అంబానీ ఆదాని లాంటి బడా పారిశ్రామికవేత్తలకు కట్ట పెట్టేందుకు కుట్టే చేస్తున్నది ఆరోపించారు ఇన్సాఫ్ నాయకులు ఎస్ రషీద్. ఎస్. మాబు.సూర్య బాబు. ఎస్ నాయబ్ భాష. మధు భాష.రఫీ తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీతను ఆచరిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోగలం

**- డాక్టర్ పార్థసారథి**
**ఆదోని శాసనసభ్యులు.**
**-తితిదే అందిస్తున్న భగవద్గీత ఉచిత పుస్తక ప్రసాద పంపిణీ అభినందనీయం.**





ఆంధ్ర ప్రగతి ఆదోని నవంబర్ 6: భగవద్గీతను ఆచరిస్తే ఉన్నస్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోగలమని , ఇది నా జీవితంలో చూసిన అద్భుతమైన పరిణామమని, ఆదోని శాసన సభ్యులు డాక్టర్ పార్థసారథి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన మానవులందరికీ భగవద్గీత ఉచిత పుస్తక ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని , విద్యార్థులకు భగవద్గీతను మన జీవితానికి ఎలా అన్వయం చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు సిద్దదేవర మఠం పీఠాధిపతులు దత్త, దేవర స్వామీజీ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు వి.శ్రీనివాసరెడ్డి, ఎన్. భీమిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బసన్న గౌడ, భాజపా జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, చిన్న బసప్ప, భీమ లింగారెడ్డి, ఆర్.సోమిరెడ్డి, సత్యనారాయణ, పులికాండప్ప, సురేశ్ బాబు, రాధారెడ్డి, అరుణా రెడ్డి, పాఠశాల బోధన మరియు బోధనేతర సిబ్బందితో పాటు స్వచ్ఛంద ధార్మిక సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భగవద్గీతను ఆచరిస్తే ఉన్నస్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోగలమని , ఇది నా జీవితంలో చూసిన అద్భుతమైన పరిణామమని, ఆదోని శాసన సభ్యులు డాక్టర్ పార్థసారథి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు



ఏర్పాటు చేసిన మానవులందరికీ భగవద్గీత ఉచిత పుస్తక ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని , విద్యార్థులకు భగవద్గీతను మన జీవితానికి ఎలా అన్వయం చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు సిద్దదేవర మఠం పీఠాధిపతులు దత్త దేవర స్వామీజీ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు వి.శ్రీనివాసరెడ్డి, ఎన్. భీమిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బసన్న గౌడ, భాజపా జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, చిన్న బసప్ప, భీమ లింగారెడ్డి, ఆర్.సోమిరెడ్డి, సత్యనారాయణ, పులికాండప్ప, సురేశ్ బాబు, రాధారెడ్డి, అరుణా రెడ్డి, పాఠశాల బోధన మరియు బోధనేతర సిబ్బందితో పాటు స్వచ్ఛంద ధార్మిక సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.